# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 22-02-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ రాష్ట్రంలో అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు మంజూరు చేస్తామని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు.
- ❖ కోట్లాది మంది ప్రజల విశ్వాసాలకు మహా కుంభమేళా ప్రతీకగా నిలుస్తుందని మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు.
- ❖ స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చరిత్రను పాఠ్యాంశంగా చేర్చేందుకు కృషి చేస్తానని కర్నూలు ఎంపి బి.నాగరాజు తెలిపారు.
- ❖ ప్రధానమంత్రి నరేంద్రమోదీ "మన్ కీ బాత్ - మనసులోని మాట" కార్యక్రమం 119వ సంచిక రేపు ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది.

==========================

రాష్ట్రంలో అర్హులైన వారందరికీ త్వరలోనే కొత్త రేషన్ కార్డులు మంజూరు చేస్తామని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెంలో మండల స్టాక్ పాయింట్ ను ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. కొత్త కార్డులను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందిస్తామన్నారు. ఏటీఎం కార్డ్ తరహాలో ఉండే ఈ కార్డుకు క్యూఆర్ కోడ్ ఉంటుందన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుండి ప్రభుత్వ పాఠశాలలు అంగన్వాడి కేంద్రాలకు సన్నబియ్యం అందిస్తామని, అంగన్వాడీలకు సరఫరా చేసే సరుకులలో నాణ్యత లోపిస్తే సహించబోమని మంత్రి హెచ్చరించారు.

(వాయిస్ 28 సెకన్లు)

==========================

ధనిక, పేద, కుల, వ్యత్యాసాలకు అతీతంగా హిందూ ధర్మం చూపే విశ్వసనీయ మార్గానికి మహా కుంభమేళా సజీవ సాక్ష్యమని రాష్ట్ర ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. ఈరోజు ఆయన ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న

కుంభమేళాలో పుణ్యస్నానం ఆచరించారు. అనంతరం ఒక ప్రకటన విడుదల చేస్తూ... పుణ్యస్నానం ద్వారా అనిర్వచనీయమైన అనుభూతి కలిగిందన్నారు. కోట్లాది మంది భక్తులు పవిత్ర స్నానం చేయటానికి ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం చేసిన ఏర్పాట్లను ఆయన అభినందించారు. ప్రజల నమ్మకాలు, సంప్రదాయాలకు కుంభమేళా ప్రతీకగా నిలిచిందనీ, హిందూ సంస్కృతి, ఆధ్యాత్మికతను ప్రపంచానికి చాటి చెప్పిందని ఆయన పేర్కొన్నారు.

===========================

స్వాతంత్ర్య సమరయోధులు ఉయ్యాలవాడ నరసింహ రెడ్డి వర్ధంతి కార్యక్రమాన్ని ఈ రోజు కర్నూలులో ఘనంగా నిర్వహించారు. నగరంలోని ఏ. క్యాంపులో ఉన్న ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహం వద్ద పార్లమెంట్ సభ్యులు బస్తిపాటి నాగరాజు, బైరెడ్డి శబరి, ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, సంయుక్త కలెక్టర్ డాక్టర్ భవ్య, తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఉయ్యాలవాడ నరసింహారెడ్డి గొప్ప తనాన్ని ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి కొనియాడారు. నరసింహ రెడ్డి జీవిత చరిత్రను పాఠ్యాంశంలో చేర్చే అంశాన్ని మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకుని వెళతానని కర్నూలు ఎంపీ నాగరాజు పేర్కొంటూ....

(వాయిస్ 20 సెకన్లు)

కాగా కర్నూలు ఎయిర్ పోర్టు కు నరసింహ రెడ్డి పేరు పెట్టేందుకు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.

===========================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్ - మనసులోని మాట" కార్యక్రమం 119వ సంచిక రేపు ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది. "మన్ కీ బాత్" తెలుగు అనువాదం ప్రధానమంత్రి ప్రసంగం అయిన వెంటనే ఒకసారి, తిరిగి రాత్రి 8 గంటలకు మరోసారి ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని అన్ని ఆకాశవాణి, దూరదర్శన్ కేంద్రాల ద్వారా ప్రసారం కానుంది.

===========================

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని విజయనగరం జిల్లా పాచిపెంట మండలం పెద చీపురువలస గ్రామ సమీపంలో గల శ్రీ పారమ్మతల్లి అమ్మవారి కొండపై జరిగే జాతర ఏర్పాట్లను రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఈరోజు పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ పరిసరాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి, భక్తుల సౌకర్యార్థం చేపట్టాల్సిన చర్యలపై సంబంధిత అధికారులకు పలు సూచనలు జారీ చేశారు. భక్తుల రద్దీ, ప్రాంగణంలో పారిశుద్ధ్యం, తాగునీరు, వైద్య శిబిరాలు, భద్రత మొదలైన అంశాలను అధికారులతో సమీక్షించి, మెరుగైన ఏర్పాట్లు చెయ్యాలని ఆదేశించారు. పారమ్మకొండ జాతర వైభవంగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేసేలా కృషి చేస్తోందని మంత్రి పేర్కొన్నారు.

విరామం

===========================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు సచివాలయంలో మిర్చి రైతుల సమస్యలపై సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో వ్యవసాయ శాఖా మంత్రి అచ్చెన్నాయుడు, ఆ శాఖ ప్రధాన కార్యదర్శి విజయానంద్, అధికారులు, పలువురు మిర్చి రైతులు, వ్యాపారులు, అధికారులు, ఎగుమతిదారులు పాల్గొన్నారు.

===========================

చిన్నపిల్లలు చేసిన నేరాలను క్షుణ్ణంగా పరిశీలించి వారిలో మార్పులు తీసుకురావాల్సిన బాధ్యత పోలీస్, చైల్డ్ వెల్ఫేర్ అధికారుల పైన ఉందని చిత్తూరు జిల్లా 1వ అదనపు జడ్జి ఎస్. రమేష్ అన్నారు. స్థానిక జిల్లా కోర్టులో బాలల సంరక్షణ

చట్టం 2015పై పోలీస్ అధికారులు, చైల్డ్ వెల్ఫేర్ సిబ్బందికి నిర్వహించిన ఒక్క రోజు శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పోలీస్, చైల్డ్ వెల్ఫేర్ అధికారులు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు బాలల న్యాయ సంరక్షణ చట్టాలపై పూర్తి అవగాహన కలిగి వుండాలన్నారు. పోలీస్, చైల్డ్ వెల్ఫేర్ అధికారులు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు సమన్వయంతో పని చేయాలని ఆయన సూచించారు.

==========================

"బేటీ బచావో.. బేటీ పఢావో.." పథకం ఒక పరివర్తనాత్మక పథకంగా మారిందని మహిళా శిశు సంక్షేమ శాఖ పథక సంచాలకులు శాంతకుమారి అన్నారు. భేటీ బచావో- భేటీ పఢావో కార్యక్రమం ప్రారంభించి 10 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో మహిళా సంక్షేమ శాఖ మహిళా పోలీస్ సిబ్బందితో నిర్వహించిన బైక్ ర్యాలీని సంయుక్త కలెక్టర్ టి. నిషాంతి ప్రారంభించారు. ఈ ర్యాలీలో పాల్గొన్న శాంతకుమారి మాట్లాడుతూ... ఈ పథకం అన్ని వర్గాల ప్రజలను భాగస్వాములను చేసిందన్నారు. గడిచిన పదేళ్లలో లింగ వివక్షలను అధిగమించడంలో కీలక పాత్ర పోషించిందని పేర్కొంటూ....

(వాయిస్ 26 సెకన్లు)

==========================

విజయనగరం జిల్లా ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి సుమారు కోటి రూపాయల విలువైన ఆధునిక పరికరాలను అందించేందుకు కొవ్వాడ లోని న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఇండియా లిమిటెడ్ (NPCIL) ముందుకు వచ్చింది. ఈ మేరకు జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్‌తో సంస్థ ప్రతినిధులు ఈరోజు ఒప్పందాలు కుదుర్చుకున్నారు. కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధుల కింద ఈ మొత్తాన్ని ఖర్చుచేసి, ఆసుపత్రిలో ఆపరేషన్ థియేటర్, న్యూరాలజీ, యూరాలజీ, బయో కెమిస్ట్రీ, తదితర విభాగాలకు వచ్చే నెలాఖరుకు పరికరాలు సమకూరుస్తారు. ఈ సందర్భంగా కలెక్టర్ సంస్థ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

==========================

పార్వతీపురం పట్టణంలో ఉన్న వార్డు విజ్ఞాన కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ ఈరోజు ఆకస్మికంగా తనిఖీ చేశారు. విజ్ఞాన కేంద్రంలో గ్రూప్ 2, ఇతర పోటీ పరీక్షల కోసం సిద్ధమవుతున్న యువతీ, యువకులతో మాట్లాడి అక్కడి వసతులపై ఆరా తీశారు. అందుబాటులో ఉన్న పోటీ పరీక్షల పుస్తకాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమయాన్ని వృథా చేసుకోకుండా విద్యా ప్రమాణాలను పెంచుకోవడానికి నిరంతర శ్రమ అవసరమన్నారు. ఉన్నత లక్ష్యాలను సాధించేందుకు జ్ఞాన సంపదను పెంపొందించుకోవాలని సూచించారు. నిరుద్యోగులకు ఉపయోగపడే విధంగా వివిధ ఉద్యోగ ప్రకటనలను నోటీసు బోర్డులో ప్రదర్శించాలని కలెక్టర్ సిబ్బందికి సూచించారు.

==========================

ఈ నెల 25వ తేదీ నుండి అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేట మండలం మత్స్యగుండంలోని శ్రీ మత్స్య లింగేశ్వర స్వామి వారి జాతర నిర్వహించనున్నామని జిల్లా సంయుక్త కలెక్టర్ ఏం. జె. అభిషేక్ గౌడ తెలిపారు. పాడేరు ఐటీడీఏ కార్యాలయం వద్ద మత్స్యగుండం ఉత్సవ కమిటి సభ్యులతో కలిసి ఆయన ఈరోజు ఉత్సవాల గోడపత్రికలను ఆవిష్కరించారు. 3 రోజుల పాటు జరిగే ఈ జాతరలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఉత్సవ కమిటీ చైర్ పర్సన్ మఠం శాంత కుమారి మాట్లాడుతూ... ఉత్సవాలకు ఏర్పాట్లు దాదాపు పూర్తి అయ్యాయని చెప్పారు. 25, 26వ తేదీల్లో సాంస్కృతిక కార్యక్రమాలు, భజన, శివ పార్వతుల కళ్యాణం నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు.

==========================

వరి సాగులో డ్రోన్ల వినియోగం ఎంతో లాభదాయకమని పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. భీమవరం మండలం తుందుర్రు గ్రామంలో.. వరి పంటకు సోకిన అగ్గి తెగులు నివారణకు ట్రైసోక్లోజోల్ మందును డ్రోన్ ద్వారా పెదజల్లే కార్యక్రమాన్ని కలెక్టర్ పరిశీలించారు.

============================

============================